క్లుప్తంగా

ప్రయివేటు పాఠశాలకు నోటీసులు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌కు ఎంఈవో నాగేశ్వర్‌రావు నోటీసులు జారీ చేశారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యం గత నెలలో గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుంటే జిల్లా విద్యాశాఖ తిరస్కరించిందని తెలిపారు. ప్రస్తుతం శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు ఎలాంటి గుర్తింపు లేదని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాఠశాల యాజమాన్యానికి నోటీసులు అందజేసేందుకు వెళ్తే యాజమాన్యం తీసుకోకపోవడంతో కార్యాలయం తలుపులకు నోటీసులు అతికించామని, స్కూల్‌పై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఎంఈవో అన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్ల కొనసాగింపు

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, టీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం బీర్కూర్ మండల విద్యాధికారి వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి షిఫ్టింగ్ అనుమతి లేకుండా ఒక చోట నుంచి మరొక చోటకు పాఠశాలలను మారుస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు. అనుమతులు లేకుండా షిఫ్టింగ్ చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

బాన్సువాడ: పట్టణంలోని ఆస్పత్రి వద్ద కొనసాగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్–బాసర జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బాన్సువాడ మున్సిపల్ పరిధిలో డ్రెయినేజీ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గతంలో నిర్మించిన డ్రెయినేజీల్లో పూడికను తొలగించి ఎత్తు పెంచాలని అన్నారు. త్వరగా డ్రెయినేజీ, ఫుట్‌పాత్‌లను నిర్మించి వాడకంలోకి తేవాలని అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తదితరులు ఉన్నారు.

బెంచీల వితరణ



రాజంపేట: తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, సన్‌రైజ్ టీంల ఆధ్వర్యంలో గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్రతినిధి డాక్టర్ బాలకిషన్ చేతుల మీదుగా రూ. లక్షా 50 వేల విలువ గల డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. రోటరీ క్లబ్ సికింద్రాబాద్, సన్‌రైజ్ టీంల ప్రతినిధులైన ప్రవీణ్, శ్రీనివాస్, బాలకిషన్‌లతో పాటు ఇతర ప్రతినిధులకు పాఠశాల హెచ్‌ఎం దొమ్మాట భిక్షపతి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని సరంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సికింద్రాబాద్ రోటరీ క్లబ్ డెస్క్ బెంచీలు అందజేసింది. హెచ్‌ఎం అనిల్‌పటేల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పొన్నాల సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరల్డ్ పోలీస్ అండర్ ఫైర్ గేమ్స్‌లో కానిస్టేబుల్‌కు కాంస్యం

కామారెడ్డి క్రైం: అమెరికా దేశం అలబామా రాష్ట్రం బర్మింగ్‌హామ్ నగరంలో జరుగుతున్న వరల్డ్ పోలీస్ అండర్ ఫైర్ గేమ్స్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ మహమ్మద్ బాబా సత్తా చాటాడు. 35 ఏళ్ల పైబడిన క్రీడాకారుల విభాగంలో షాట్‌పుట్ క్రీడల్లో పాల్గొన్న మహమ్మద్ బాబా కాంస్య పతకం సాధించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గత నెల 27న ప్రారంభమైన ఈ క్రీడలు ఈ నెల 6 వరకు జరుగనున్నాయని తెలిపారు. పతకాన్ని సాధించిన బాబాను అభినందించారు.

ఇళ్లకు తాళాలు వేయడం ఎంతవరకు సమంజసం

బాన్సువాడ: దేశాయిపేట్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రెవెన్యూ అధికారులు తాళాలు వేశారని, డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసముంటున్న కొందరు అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు, ఊళ్లకు వెళ్తే వారి ఇళ్లకు తాళాలు వేయడం ఎంత వరకు సమంజసమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి ప్రశ్నించారు. కొందరు అద్దెలకు ఇచ్చి ఏళ్ల తరబడి నివాసం లేకున్నా వారి ఇళ్లకు మాత్రం తాళాలు వేయలేదని చెప్పారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. నిరుపేదల ఇళ్లకు వేసిన తాళాలు తీసేయాలని సబ్‌కలెక్టర్ కిరణ్మయికి విన్నవించారు. స్పందించిన సబ్ కలెక్టర్.. తాళాలు వేసిన ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేయాలని సూచించడంతో అధికారులు తాళాలు ఇచ్చారు. బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మోహన్ రెడ్డి, మజ్జిగ శ్రీనివాస్, చిరంజీవి, ఉమేష్ తదితరులున్నారు.

వంతెన నిర్మించారు.. బీటీ రోడ్డు మరిచారు

- అసంపూర్తిగా నిలిచిపోయిన పద్మాజీవాడి–కల్వరాల్ రోడ్డు
- గుంతలమయంగా మారిన వైనం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి–కల్వరాల్ గ్రామాల మధ్య గల రోడ్డు కొన్ని సంవత్సరాలుగా బీటీ రోడ్డుకు నోచుకోవడం లేదు. ఈ రెండు గ్రామాల మధ్య గతంలో వంతెన నిర్మాణం చేపట్టారు. కానీ ఇరు వైపులా కేవలం మెటల్ రోడ్డు ఉండడం వల్ల వర్షాలకు పూర్తిగా నడవలేని దుస్థితి నెలకొంది. వంతెనకు ఇరువైపులా రోడ్డు గుంతలమయంగా మారడంతో కల్వరాల్, పద్మాజీవాడి గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం దృష్టి సారించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పద్మాజీవాడి-కల్వరాల్ గ్రామాల మధ్య రోడ్డు ఇదే

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



తరగతి గదిని పరిశీలిస్తున్న ఎంఈవో దేవేందర్ రావు



మాక్ ఎలక్షన్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో రాజులు

మాచారెడ్డి: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా బోధించాలని మాచారెడ్డి మండల విద్యాధికారి దేవేందర్‌రావు సూచించారు. గురువారం లచ్చాపేట ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన సమయంలో ఆయన సందర్శించారు. అనంతరం తరగతులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ గుణాత్మక విద్యనందించాలని సూచించారు. హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు శ్రీకాంత్, బ్రహ్మం, సీఆర్పీ నరేశ్ ఉన్నారు.

గురుకుల పాఠశాలలో మాక్ ఎలక్షన్స్

ఎల్లారెడ్డి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. స్కూల్ కౌన్సిల్ ఎన్నికలలో భాగంగా విద్యార్థులకు ఎన్నికల అవగాహన కోసం మాక్ ఎలక్షన్స్ చేపట్టారు. మాక్ ఎలక్షన్స్‌ను ఎంఈవో రాజులు, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్ తదితరులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులున్నారు.



డీఈవో, ఎంఈవోలు అందజేసిన స్కూల్ బ్యాగులతో టేక్రియాల్ పాఠశాల విద్యార్థులు

స్కూల్ బ్యాగుల పంపిణీ

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని టేక్రియాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 103 మందికి రూ.25 వేల విలువైన స్కూల్ బ్యాగ్‌లను డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్యలు పంపిణీ చేశారు. విశ్రాంత ఉద్యోగి ఆర్.చంద్రకాంత్, రాజూరి అంజనేయులు, తొడుపునూరి సాంబమూర్తి, పాత అశోక్‌లు ఆర్థిక సహాయం చేయగా విద్యార్థులందరికి స్కూల్‌బ్యాగులు కొనుగోలు చేసి అందజేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగాకిషన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సునంద, హెచ్‌ఎం శ్రీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్‌ల దినోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా గురువారం లింగంపేట మండల కేంద్రంలో మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల మెకానిక్‌ల అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడారు. మెకానిక్‌లకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ఉపాధ్యక్షుడు యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాషా, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే విద్యార్థులకు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. జలాల్‌పూర్ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీ, పల్లెప్రకృతివనంలోని మొక్కలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లేశం ఉన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలను పరిష్కరించండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితకు వినతిపత్రాన్ని అందజేశారు. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. వేతనాలతో పాటు రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో–51ను రద్దు చేసి నెలనెలా వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. జీపీ సిబ్బంది సంఘం మండల అధ్యక్షుడు శివానందగౌడ్, కారోబరులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొగులాలి పీర్ల పండుగ



బాన్సువాడ రూరల్: సోమేశ్వర్, బోర్లం తదితర గ్రామాల్లో గురువారం మొగులాలీ పీర్ల పండుగ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఆశీర్‌ఖానాల్లో పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాయి అగ్నిగుండం చుట్టూ తిరుగుతూ అసయ్ దూలా పాటలు పాడారు. పలువురు భక్తులు కందూర్లు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్లను అందంగా అలంకరించి గ్రామంలో బాజాభజంత్రీల నడుమ ఊరేగించారు.

మహాదేవుడి గుట్టను కాపాడాలని వినతి



గాంధారి(ఎల్లారెడ్డి): గుడిమెట్ గ్రామ సమీపంలో గల మహాదేవుడి ఆలయం ఉన్న గుట్టను చుట్టుపక్కల గ్రామాల రైతులు ఆక్రమించుకుని ట్రాక్టర్లతో దున్ని పంటలు సాగు చేస్తున్నారని ఆరోపిస్తూ మహాదేవుని గుట్టను కాపాడాలని గురువారం తహసీల్దార్ రేణుక చౌహాన్‌కు మాధవపల్లి గ్రామస్తులు వినతి పత్రం ఇచ్చారు. అధికారులు గుట్టను పరిశీలించి పంటలు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలో ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రేణుక చౌహాన్ హెచ్చరించారు. మహాదేవుని గుట్ట భూమిని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆక్రమించి ట్రాక్టర్లతో దున్ని పంటలు సాగు చేస్తున్నారని, ఆ భూమిని కాపాడాలని కోరుతూ మాధవపల్లి గ్రామస్తులు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన తహసీల్దార్ గిర్దావర్‌తో క్షేత్రస్థాయిలో విచారణ చేయించినట్లు తెలిపారు. విచారణ ఆధారంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అన్నారు.

ఇళ్ల పనులు వేగవంతం చేయండి

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. గురువారం వెల్లుట్లపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి కాలనీలు పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచులు చిరంజీవులు, సాయిలు ఉన్నారు.

స.హ. చట్టంపై అవగాహన



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం సరంపల్లి సమీపంలోని నాగిరెడ్డిపేట గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో గురువారం సమాచార హక్కు చట్టం(స.హ.చట్టం)పై కార్యక్రమం నిర్వహించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు స.హ.చట్టం గురించి కనీస అవగాహన కల్గి ఉండడం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయని స.హ. చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరేష్, న్యాయవాది ఈక శ్రీనివాస్‌రావు, ప్రతినిధులు డి.లింగమయ్య, టి.రాములు పాల్గొన్నారు.

శిథిలమైన గదిలో తరగతులు కొనసాగించడం లేదు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి ప్రాథమిక పాఠశాలలో శిథిలమైన గదిలో తరగతులు నిర్వహించడం లేదని ఎంఈవో రాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో రెండు గదులు ఉండగా ఒక గది శిథిలావస్థకు చేరిందని మరో గదిలో తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. శిథిలావస్థకు చేరిన గదిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తామన్నారు.

‘నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మారుస్తా’



లింగంపల్లిలో బల్క్ నీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మారుస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. గురువారం లింగంపల్లిలో రూ.2.40 కోట్లతో మిషన్ భగీరథ బల్క్ నీటి కనెక్షన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగంపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లోకి ఇప్పటికే ఒక పరిశ్రమ వచ్చిందని అది వచ్చే నెలలో ప్రారంభం కాబోతుందన్నారు. ఈ పరిశ్రమతో యువతకు ఎంతో ఉపాధి లభిస్తుందన్నారు. గతంలో జాబ్ మేళాలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి నిధులను తీసుకొచ్చినట్లు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్, ఏఎంసీ చైర్మన్ సంగ్యా నాయక్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో శుభ్రత పాటించాలి



బిచ్కుంద(జుక్కల్): వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి.. ఆస్పత్రిలో సిబ్బంది శుభ్రత పాటించాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం సూచించారు. గురువారం బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రి సందర్శించి రోగులు ఉండే వార్డు గదులు, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలు పరిశీలించారు. వైద్య సిబ్బంది అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరిశుభ్రత, తాగునీటి వసతి గురించి సమస్య తలెత్తితే మున్సిపల్ కార్యాలయానికి సంప్రదించాలని, వసతులు కల్పిస్తామని కమిషనర్ తెలియజేశారు. సూపర్‌వైజర్ మొయినోద్దీన్, హెడ్ నర్సు శారద ఉన్నారు.

తరగతులు ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక రెడ్డి సంఘం భవనంలో గురువారం ప్రిన్సిపల్ శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కావడం వల్ల మండల ప్రజలకు ఇంటర్మీడియట్ విద్య మరింత దగ్గరైందని పేర్కొన్నారు. పిల్లలను చదువుల కోసం దూరం పంపకుండా, ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు అఖిల్, శ్రీకాంత్, వెంకటస్వామి, సత్యనారాయణ, సురేందర్, భాస్కర్, నరేష్, రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్లు సంగీత, పుష్పలత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లోని మహిళా సంఘాల బలోపేతానికి గ్రామ సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని కరీంనగర్ జిల్లాకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సంగీత, పుష్పలత సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం 16 గ్రామ సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. గ్రామసంఘాల విధులు, బాధ్యతలు, ఆఫీసు నిర్వహణ, సమావేశాల ప్రాధాన్యత, కట్టుబిట్లు, పుస్తకాల నిర్వహణ, మొబైల్ యాప్‌లో డాటా ఎంట్రీపై అవగాహన కల్పించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, కోశాధికారి మునెమ్మ, ఏపీఎం జగదీశ్, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎల్లారెడ్డి: ప్రజలు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 7వ వార్డులో పర్యటించారు. కాలనీలలో తిరుగుతూ పరిసరాల చుట్టూ మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద నిజామాబాద్ వైపునకు వెళ్లే సర్వీస్ రోడ్డు వర్షపుధాటికి కోతకు గురైంది. వాహనాలు అదుపు తప్పితే భారీ ప్రమాదం జరిగే అవకాశముంది. హైవే అధికారులు దృష్టి సారించి కోతకు గురైన సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



సజ్జన్‌పల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో నరేష్

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. గురువారం ఆయన సజ్జన్‌పల్లిలో ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గ్రామస్తులు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు.

నర్సరీల నుంచి మొక్కలు తీసుకెళ్లాలని సూచించారు. మానవుని జీవనం చెట్లపై ఆధారపడి ఉందన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించి పలు సూచనలు చేశారు.



ఎంద్రియాల్ శివారులో.. కాంగ్రెస్ పార్టీ నేతలు

ఎంద్రియాల్‌లో వన మహోత్సవం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎంద్రియాల్‌లో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ శివారులో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు షౌకత్‌అలీ, లక్ష్మణచారి, శివాజీ, శ్యాంరావు, మేకల రాజు, సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, అఖిల్‌రావు, నారాయణరెడ్డి, సంజీవు, కారోబరు సదానందగౌడ్, ఫీల్డు అసిస్టెంటు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

యూరియా అందుబాటులో ఉంచాలి

నస్రుల్లాబాద్: రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి భవాని సూచించారు. గురువారం మైలారం, నస్రుల్లాబాద్, బొమ్మన్‌దేవ్‌పల్లి, దుర్కిలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. యూరియా కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయించడానికి ప్రయత్నిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, అల్లం సాయిలు, సిబ్బంది సంగమేశ్వర్ ఉన్నారు.

పథకాలు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నస్రుల్లాబాద్: రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మిర్జాపూర్ ఏఈవో గ్రీష్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నాచుపల్లి రైతులకు గురువారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేశారు. దీనిలో భాగంగా కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బంధు, ఫసల్ బీమా పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందన్నారు. దీని కోసం ప్రతి ఒక్కరూ స్థానిక రైతు వేదికకు స్వచ్ఛందంగా ఫోన్, ఆధార్ కార్డు తీసుకు వచ్చి నమోదు చేసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామంలో ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యురాలు యెమిమా ఆధ్వర్యంలో సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేపట్టారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు సువర్ణ, హేమలత, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి

పిట్లం(జుక్కల్): పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ అసద్ ఫారూక్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

కళాశాల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.20 లక్షల రూపాయాలను మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రాధాదేవి గురువారం తెలిపారు. కళాశాలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి విద్యుత్ సౌకర్యం కోసం ఈ నిధులను వెచ్చించనున్నట్లు చెప్పారు. త్వరలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

బీడీ కార్మికుల పెన్షన్‌లు పెంచాలి

బీబీపేట: బీడీలు చేసి రాజీనామా చేసిన కార్మికుల పెన్షన్‌లు రూ.5 వేలు పెంచాలని కోరుతూ తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం సభ్యులు గురువారం మండల తహసీల్దార్ గంగసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికుల సంఘం నేతలు శివంది సత్యం, రాజేందర్, బాలమణి, లక్ష్మిలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): కొయ్యగుండు తండా ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీవో మలహరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు సుజాత, అంగన్‌వాడి టీచర్, కార్యదర్శి ఉన్నారు.